తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

## అన్నపూర్ణాదేవిగా గంగమ్మ



తిరుపతి,అక్టోబర్ 13ప్రభాతవార్త:

తిరుపతి నగరగ్రామదేవత తాతయ్య గుంట గంగమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మంగళవారం కూడా కావడంతో ఉదయం అమ్మవారి మూలవర్లకు అభిషేకం, హోమం కుంకుమార్చన కార్యక్రమాలు జరిపించారు. రాత్రి ఊంజలసేవలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు ,పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. ఆలయంలో భక్తులకు ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఈఓ ఎ. జయకుమార్ అమ్మవారి దర్శనం, ప్రసాదాలు అందించారు.



## హంసవాహనంపై వీణాపాణి

తిరుమల,అక్టోబర్ 13 ప్రభాతవార్త :

చేతిలో వీణను కలిగి బ్రహ్మదేవుని వాహనమైన హంసను స్వయంగా వాహనంగా చేసుకుని సరస్వతిదేవి అలంకారంలో మలయప్పస్వామి భక్తులకు అభయమిచ్చాడు. మంగళవారం రాత్రి సాక్షాత్తు శ్రీనివాసుడు వీణాపాణిగా సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. హంస అనే పదానికి అనేక అర్థాలున్నాయి. శ్రీనివాసుడు హంసవాహనంపై ఊరేగడం ఆనందదాయకం. మానససరోవరంలో హంసలు విహరిస్తాయి. పరమాత్మ యోగిపుంగవుల మనస్సరస్సులలో విహరిస్తారు. హంస స్వరూపుడైన దేవదేవుడు వీణాపాణిగా రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు తిరువీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహనం ముందు గజరాజులు, అశ్వాలు ఠీవిగా నడుస్తుండగా భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించారు. మంగళవాయిద్యాలు, డ్రమ్స్ వాయిద్యాలు,ఇతర కళాప్రదర్శనల నడుమ స్వామివారివాహనసేవ అత్యంత రమణీయంగా జరిగింది. ఈ వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి దంపతులు, పాలకమండలి సభ్యులు, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ పేష్కార్ రామకృష్ణ,సిపిఆర్ఓ డాక్టర్ తలారిరవి, అర్చకులు పాల్గొన్నారు.

### జడ్పిటిసి, ఎంపీపీల

## రిజర్వేషన్లు ఖరారు

చిత్తూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త :

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జడ్పిటిసి, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. బైరెడ్డిపల్లి జెడ్పిటిసి స్థానం బీసీ జనరల్ కు కేటాయించగా ఎంపీపీ స్థానం ఓసి మహిళ కు కేటాయించారు. అలాగే బంగారు పాల్యం జడ్పిటిసి ఓసి మహిళ, ఎంపీపీ స్థానం ఎస్సీ జనరల్, చిత్తూరు జడ్పిటిసి స్థానం ఎస్సీ మహిళ, ఎంపీపీ స్థానం జనరల్, జీడి నెల్లూరు జెడ్పిటిసి ఎస్సీ మహిళ, ఎంపీపీ జనరల్, గంగవరం జడ్పిటిసి జనరల్, ఎంపీపీ బీసీ మహిళ, గుడిపాల జడ్పిటిసి జనరల్, ఎంపీపీ ఎస్సీ మహిళ, గుడుపల్లి జెడ్పిటిసి ఓసి మహిళ, ఎంపీపీ ఎస్సీ మహిళ, ఐరాల జడ్పిటిసి ఎస్సీ జనరల్, ఎంపీపీ జనరల్ వర్గాలకు రిజర్వ్ అయ్యాయి. అలాగే కార్వేటి నగరం జడ్పిటిసి జనరల్, ఎంపీపీ ఎస్సీ జనరల్, కుప్పం జెడ్పిటిసి ఓసి మహిళ, ఎంపీపీ ఓసి మహిళ, నగిరి జెడ్పిటిసి బీసీ మహిళ, ఎంపీపీ జనరల్, నింద్ర జడ్పిటిసి ఎస్సీ జనరల్, ఎంపీపీ ఎస్సీ మహిళ, పలమనేరు జడ్పిటిసి జనరల్, ఎంపీపీ ఓసి మహిళ వర్గాలకు రిజర్వ్ అయ్యాయి. అలాగే పాలసముద్రం జడ్పిటిసి ఓసి మహిళ, ఎంపీపీ ఎస్సీ మహిళ, పెద్దపంజాణి జెడ్పిటిసి జనరల్, ఎంపీపీ బీసీ మహిళ, పెనుమూరు జడ్పిటిసి ఓసి మహిళ, ఎంపీపీ జనరల్, పులిచెర్ల జడ్పిటిసి బీసీ జనరల్, ఎంపీపీ ఓసి జనరల్ వర్గాలకు రిజర్వ్ అయ్యాయి. అలాగే పూతలపట్టు జడ్పిటిసి ఓసి జనరల్, ఎంపీపీ ఓసి జనరల్, రామ కుప్పం జెడ్పిటిసి ఎస్టి మహిళ, ఎంపీపీ బీసీ జనరల్, రొంపిచర్ల జడ్పిటిసి బీసీ మహిళ, ఎంపీపీ ఓసి మహిళ, ఎస్ఆర్ పురం జడ్పిటిసి ఎస్సి మహిళ, ఎంపీపీ ఓసి జనరల్, శాంతిపురం జడ్పిటిసి ఓసి మహిళ, ఎంపీపీ బీసీ జనరల్ వర్గాలకు రిజర్వ్ అయ్యాయి. అలాగే తవణంపల్లి జడ్పిటిసి ఓసి జనరల్, ఎంపీపీ ఎస్సీ మహిళ, వీకోట జడ్పిటిసి బీసీ జనరల్, ఎంపీపీ మహిళ జనరల్, వెదురుకుప్పం జెడ్పిటిసి ఓసి మహిళ, ఎంపీపీ ఎస్సీ జనరల్, విజయపురం జడ్పిటిసి ఎస్సీ జనరల్, ఎంపీపీ ఓసి మహిళ, యాదమరి జడ్పిటిసి ఎస్సీ మహిళ, ఎంపీపీ ఓసి జనరల్ కు రిజర్వ్ అయ్యాయి.

### చిన్నశేషునిపై

## ద్వారకాకృష్ణుడు

### -భుజాలపై వాహనాన్ని మోసి పరవశం



తిరుమల,అక్టోబర్ 13 ప్రభాతవార్తప్రతినిధి:

దేవదేవుడు శ్రీవేంకటేశ్వరుని నవరాత్రిబ్రహ్మోత్సవాలలో మంగళవారం ఉదయం ద్వారకాకృష్ణుడి అలంకారంలో మలయప్ప స్వామి ఐదుతలల చిన్నశేషునిపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఎల్లప్పుడూ శేషునిమీద శయనించే స్వామి మళ్లీ ప్రీతితో రెండవసారి శేషవాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం 8గంటలకు నిత్యకైంకర్యాలు ముగించుకుని వాహనమండపంవద్ద ఐదుతలల చిన్నశేషవాహనంపై వేంచేపుచేసిన మలయప్ప ప్రత్యేక పూజలందుకుని అక్కడ నుంచి ఊరేగుతూ భక్తులను కటాక్షించాడు. చిన్నశేష వాహనం వాసుకిగా భావిస్తారు. వాహనం ముందు గజరాజులు, అశ్వాలు ఠీవిగా నడుస్తుండగా భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి దంపతులు, పాలకమండలి సభ్యులు, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ పేష్కార్ రామకృష్ణ అర్చకులు పాల్గొన్నారు.

### తిరుపతి మేయర్ ఎన్నికల

## ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



తిరుపతి కార్పొరేషన్, జూన్ 14 ప్రభాతవార్త

తిరుపతి నగరపాలక సంస్థ స్థానిక ఎన్నికలు -2026 నిర్వహణలో భాగంగా ఓట్ల లెక్కింపు కోసం శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో చేపట్టాల్సిన ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ల ఏర్పాటు, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు హాళ్ళు, మేయర్ పదవికి సంబంధించిన ఓట్ల లెక్కింపు హాల్, ఎన్నికల సామగ్రి నిల్వ గదులు, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్ల నిరీక్షణ గదులు, మీడియా గది, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లకు సంబంధించి రూపొందించిన గదుల వారీ ప్రతిపాదనలను పరిశీలించారు. కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన గదుల లభ్యత, అంతస్తుల వారీగా గదుల కేటాయింపు, సిబ్బంది మరియు ఎన్నికల విధులకు సంబంధించిన ఇతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ప్రతిపాదనల ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు, రెండవ అంతస్తుల్లో స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ హాళ్ళు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మేయర్ పదవికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం భవనంలోని మొదటి అంతస్తు సెంట్రల్ హాల్ను, స్ట్రాంగ్ రూమ్ల ఏర్పాటుకు సంబంధించి మొదటి అంతస్తులో 1 నుంచి 18వ వార్డు వరకు, రెండవ అంతస్తులో 19 నుంచి 66వ వార్డు వరకు ఆర్.ఓ. క్లస్టర్ల వారీగా ప్రతిపాదనలు రూపొందించారని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి ఆమోదానికి అనుగుణంగా రెండు స్ట్రాంగ్ రూమ్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారని తెలిపారు. అనంతరం ఎన్నికల ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, గదుల కేటాయింపులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీ లత,ఎలక్షన్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తిరుపతి స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమోళి, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ చైర్మన్ గిరి

## ఆశిస్తున్న ఆ ముగ్గురు

### తెదేపా నుంచి రాజ్‌కుమార్..డాక్టర్ వెంకటేష్..కన్నన్ !!

### ఐవిఆర్ఎస్ కాల్స్.. సిఎం చంద్రబాబు నిర్ణయమే ఫైనల్ !!



రాజ్‌కుమార్, డాక్టర్ వెంకటేష్, కన్నన్

కుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ చైర్మన్ స్థానం ఎస్సీ (జనరల్) కేటగిరీకి రిజర్వేషన్ ఖరారైన నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ నుంచి చైర్మన్ సీటును ముగ్గురుమంది నేతలు ఆశిస్తున్నారు. వీరు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రధానంగా కుప్పం మండల మాజీ జడ్పీటిసి అయిన రాజ్‌కుమార్ చైర్మన్ సీటును ఆశిస్తున్నారు. ఈయన 2004లో తెదేపా కార్యకర్తగా పార్టీలో ఉంటూ 2014లో కుప్పం మండల జడ్పీటిసిగా పోటీచేసి గెలిచారు. 2019వరకు జడ్పీటిసిగా ఉన్నారు. అనంతరం 2019లో వైకాపా అధికారంలో రాగానే రాజ్‌కుమార్ అతని కుటుంబీకులు అప్పటి అధికార పార్టీ నేతలకు కొంత టార్గెట్‌గా మారారు. రాజ్‌కుమార్‌పై కేసులు సైతం నమోదైజైలుకు వెళ్లివచ్చారు.ప్రస్తుతం కడ సభ్యుడిగా ఉన్నారు. ఇదిలా ఉండగా కుప్పం మండల మాజీ ఎంపిపి, కుప్పం మాజీ సర్పంచ్ డాక్టర్ వెంకటేష్ సైతం మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ఈయన 2006లో రాజకీయాల్లో వచ్చి కుప్పం ఎంపిపిగా ఐదేళ్లపాటు పనిచేశారు. విద్యావంతుడైన డాక్టర్ వెంకటేష్ అనంతరం కుప్పం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సైతం ఐదేళ్లు కొనసాగారు. రాజకీయాల్లో వచ్చాక ఈయన అధ్యాపక వృత్తిని వదిలేశారు. ప్రస్తుతం తెదేపా రాష్ట్ర ప్రొఫెషనల్ వింగ్‌లో ఉన్నారు. ఇక క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా ఉన్న కన్నన్ సైతం మున్సిపల్ చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. ఈయన 2023లో సిఎం చంద్రబాబునాయుడు సమక్షంలో తెదేపాలో చేరారు. దళిత నాయకుడిగా సైతం ఈయన ఉన్నారు.కాగా చైర్మన్ పదవిని ఆశిస్తున్న నేతల తీరుపై సిఎం చంద్రబాబునాయుడు ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాన్ని తీసుకోనున్నారు. అనంతరం అభ్యర్థి ఎవరనేది సిఎం చంద్రబాబు తీసుకునే నిర్ణయమే ఫైనల్ నిర్ణయం.

### గజ వాహనంపై విహరించిన

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మ

### వైభవంగా దేవీ నవరాత్రి మహోత్సవాలు



చంద్రగిరి, అక్టోబర్ 13 ప్రభాతవార్త:

చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారు గజ వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి దేవీ నవరాత్రి మహోత్సవాలు దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి పాలక మండలి, ఈఓ మమత పర్యవేక్షణలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి 7 గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి వేంచేపు చేశారు. ఆలయ పూజారి సూరి స్వామి వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో గజలక్ష్మీదేవిగా విశేష అలంకరణ గావించి గజ వాహనంపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, బ్యాండుభాజాలతో అమ్మవారి వాహన సేవ కన్నుల పండువగా సాగుతుండగా మహిళలు మంగళహారతులతో మ్రొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి, దాతలు, గ్రామస్థులు, ఓంశక్తి భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ చెంగాళమ్మకు శ్రీ అన్నపూర్ణ అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 13, ప్రభాతవార్త

తెలుగు, తమిళ భక్తులఆరాధ్య దైవమైనశ్రీ చెంగాళ మాత పరమేశ్వరి దేవికి శరన్నవరాత్రుల సందర్భంగా మంగళవారం శ్రీ అన్నపూర్ణ అలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలంకారానికి ఉభయకర్తగా ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్, కోమలి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన యాగ మండపంలో నిర్వహించిన చండీ యాగానికి హైదరాబాదుకు చెందిన బారాతుల కళ్యాణ్ కుమార్ గాయత్రి దంపతులు ఉభయకర్తలగా ఉన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగాఆది గురుకృపా కూచిపూడి కళా నిలయం నెల్లూరు వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీ డాన్స్ అకాడమీ సూళ్లూరుపేట వారిచే భరతనాట్య, కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీ నందికేశ్వర కూచిపూడి కళాక్షేత్రం నెల్లూరు వారిచే భరత నాట్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

### కూటమి అభ్యర్థిని దీటుగా ఎదుర్కొనే...

## అభ్యర్థి కోసం అన్వేషణ!

శ్రీకాళహస్తి, అక్టోబర్ 13 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తిలో మున్సిపల్ రిజర్వేషన్ ఖరారు కావటంతో రాజకీయ పార్టీల్లో సందడి చోటు చేసుకుంది. కూటమిలో తెలుగుదేశంలోనూ, జనసేన, బిజెపిలో అభ్యర్థులు సిద్దంగా ఉన్నారు. అయితే ప్రతిపక్ష వైకాపా పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. దీటుగా ఎదుర్కొనే అభ్యర్థి కోసం అన్వేషణ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇక్కడ మున్సిపల్ చైర్మెన్‌గా పదవి అనుభవించి ప్రస్తుతం నెల్లూరులో ఉంటున్న డాక్టర్ అన్నపూర్ణ భర్త డాక్టర్ విజయకుమార్‌ను రంగంలో దించటానికి వాతావరణాన్ని పరిశీలిస్తున్నారు. పరిపాలన పట్ల అవగాహన ప్రజలతో మంచిసంబంధాలు కల్గిన వారిని ఒప్పించాలని పార్టీ వర్గాలు యోచిస్తున్నాయి. అయితే శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో మైనారిటి ముస్లింలు సుమారు 16వేల మంది ఓటర్లున్నట్లు సమాచారం. దాంతో ఆ వర్గం నుంచి ఎవర్ని అయినా ఎంపిక చేస్తే బాగుంటుందనే అభిప్రాయంపై కూడా స్థానిక నాయకత్వం చర్చించుకుంటున్నారు. ఇక బిసిసామాజిక వర్గానికి చెందిన వన్నెకుల క్షత్రియులు బుజ్జిరెడ్డి, టిఎంవి కండ్రిగకు చెందిన ఇద్దరు యువకులున్నారు. పార్టీలో ఆది నుంచి ఉన్న వడ్లతాంగాళ్ బాలాజి ప్రసాద్‌రెడ్డి, విద్యావంతుడు వాణిజ్యంలో ఉన్న బత్తిరెడ్డిని, రంగంలో దించితే ఆ సామాజిక వర్గం ఓట్లు దక్కే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఇలా వైకాపా అభ్యర్థి కోసం అన్వేషిస్తున్నారు.



**పట్టణంలో పార్టీ పరిస్థితికి ఎదురు లేదు:**

శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలో వైకాపాకు తిరుగులేదని ఆ పార్టీ నాయకుడు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి భావిస్తున్నారు. అధికార కూటమి పాలనపై జనాల్లో వ్యతిరేకత వచ్చేసిందని భావిస్తున్నారు. వారి తప్పిదాలే మనకు శ్రీరామరక్ష అన్నట్లు వున్నారు. కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో విజయం తథ్యమని, దాంతో దీటైన అభ్యర్థి కోసం అన్వేషిస్తున్నారు.

**అన్ని బాగానే ఉంది...పెట్టుబడి పెట్టెదెవరు!**

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వైకాపాలో అన్ని బాగానే ఉందని అయతే పెట్టుబడి పెట్టెదెవరని డోలాయమానంలో ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో కనీసం రూ.5 నుంచి 6 కోట్లు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. చైర్మెన్ ఓటుతో పాటు, కౌన్సిలర్ ఓటుకు కూడా పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది.అయితే పెట్టుబడి ఎవరు పెట్టాలి? ఆర్థికంగా ఎలా చేయాలనే అంశంపై మలగుల్లాలు పడుతున్నారు. పెట్టుబడి పెట్టె వారి కోసం అన్వేషిస్తున్నారు.

**రెండేళ్ళు పట్టించుకోకుండా ...**

శ్రీకాళహస్తిలో సుమారు రెండున్నర సంవత్సరం పాటు రాజకీయాలను గాలికి వదలి వేయటంతో పార్టీలో ప్రముఖులు చేజారిపోయారు. ఓ వైపు మున్సిపల్ ఎన్నికలు మరో వైపు మండల జిల్లా పరిషత్ ఎన్నికలకు అభ్యర్థులతో పాటు కొంత వరకు పెట్టుబడి పెట్టుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితిలో కూటమికి ఎదురు నిల్చేందుకు ఎవరూ సాహసించరు. అధిష్టానం ఏమో గెలిపించుకు రావాలి! ప్రతిదగ్గర పోటీ ఉండాలని ఆదేశిస్తున్నట్లు వివనబడుతుంది.

## చిత్తూరు 'దేశం'లో బలిజల తిరుగుబాటు

### మేయర్ అభ్యర్థిత్వం తమ సామాజిక వర్గానికి చెందిన వారికే ఇవ్వాలని డిమాండ్

### మాజీ ఎమ్మెల్యే సికె బాబు కుటుంబంలో అభ్యర్థిత్వం ఇస్తే పని చేయమని స్పష్టం

చిత్తూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త:



చిత్తూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి అండగా నిలుస్తూ వచ్చిన బలిజ సామాజిక వర్గం మేయర్ అభ్యర్థి ఖరారు విషయంపై ఒక్కసారిగా తెలుగుదేశంపై తిరుగుబాటు చేసింది. చిత్తూరు నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బలిజ సామాజిక వర్గానికి చెందిన వారికి పార్టీ అధిష్టానం కేటాయిస్తూ వచ్చిందని, ఈ సారి తెలుగుదేశం పార్టీ అధిష్టానం కమ్మ సామాజిక వర్గ అభ్యర్థికి ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కేటాయించినా బలిజ సామాజిక వర్గం మొత్తం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గురజాల జగన్మోహన్‌నాయుడును ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం జరిగిందని బలిజ సామాజిక వర్గ నాయకులు స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థిగా బలిజ సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం కల్పించాలని తెలుగుదేశం పార్టీ అధిష్టానంను ఆల్టిమేటం జారీ చేశారు. తెలుగుదేశం మేయర్ అభ్యర్థిగా బలిజ సామాజిక వర్గానికి చెందిన కాజూరు బాలాజీ సతీమణి ద్రాక్షాయణి లేదా మాజీ మేయర్, ప్రస్తుత చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలతలకు ఇవ్వాలని సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం పెట్టి తెలుగుదేశం పార్టీ అధిష్టానంను డిమాండ్ చేసిన బలిజ సామాజిక వర్గ నేతలు మంగళవారం నాగయ్య కళాక్షేత్రం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు మేయర్ అభ్యర్థిత్వం విషయంపై మరోసారి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చిత్తూరు మేయర్ అభ్యర్థిత్వంను పార్టీ అధిష్టానం మాజీ ఎమ్మెల్యే సికె బాబు కుటుంబంలో ఇవ్వడానికి సిద్ధపడినట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోందని, చిత్తూరులో మాజీ ఎమ్మెల్యే సికె బాబు గత కొన్నేళ్ళుగా బలిజ సామాజిక వర్గంతో వ్యతిరేకత కొనసాగిస్తున్నారని, అలాంటి కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిత్వం కేటాయిస్తే సహించమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బలిజ సేవా సంఘ సమితి నాయకులు ఓఎం రామ్‌దాసు, కిషోర్, పెద్దసంఖ్యలో బలిజలు పాల్గొన్నారు.

4 CTR 2:14 CTR 2.qxd 10/14/2026 12:05 AM Page 1



## సిఎంను కలసిన శాంతిపురం నేతలు

శాంతిపురం, అక్టోబర్ 13 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడును శాంతిపురం మండలంకు చెందిన యూనిట్ ఇన్‌చార్జ్‌లు మణి, గిరిధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రాళ్లబూదుగూరు గ్రామంలోని శ్రీకోదండరామాలయం వద్ద కళ్యాణ మండపం మంజూరు చేయాలని సిఎంను కోరారు. అలాగే తనకు ఎంపిపిగా అవకాశం కల్పించాలని సైతం సిఎంను కోరినట్లు సమాచారం. కర్లగట్ట యూనిట్ ఇన్‌చార్జ్ గిరిధర్ స్థానిక ఎన్నికల్లో యువత తరపున తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిసింది.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

రామకుప్పం, అక్టోబర్ 13ప్రభాతవార్త



మండలంలోని మణీం ద్రం గ్రామంలో సిఎంఆర్ఎఫ్ ద్వారా మం జూరైన చెక్కులను క్లస్టర్ ఇన్‌చార్జ్ రవిరెడ్డి, రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్ లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా లబ్దిదారులు సిఎం చంద్రబాబు నాయుడుకుకృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు మంజునాథరెడ్డి, అరుణజ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

## కార్యకర్త అంత్యక్రియలకు ఆర్థికసాయం

రామకుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త



మండలంలోని కావలిమడుగు గ్రామంకు చెందిన తెదేపా కార్యకర్త వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న తెదేపా నేతలు వెంకటమ్మ మృతదేహంకు నివాళులు అర్పి ంచి అంత్య క్రియలకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో రెస్కో ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, నేతలు గంట్లప్పగౌడు, కృష్ణానాయక్, రాజేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసు ఉుగౌడు, బాబు, మునిరాజునాయక్, మురుగేష్ పాల్గొన్నారు.

## 17 వరకు ఉద్యాన వారోత్సవాలు - ఎ.డి. పల్లవి

కుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త



రాయలసీమ గ్లోబల్ హార్టీకల్చర్ హబ్ (సమగ్ర ఉద్యాన కేంద్రం) కార్యక్రమంలో భాగంగా కుప్పం క్లస్టర్ పరిధిలో ఈనెల 17వతేదీ వరకు ఉద్యాన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉద్యానశాఖ ఎ.డి. పల్లవి తెలిపారు. కుప్పం, రామకుప్పం, గుడుపల్లె, శాంతిపురం, పలమనేరు, వి.కోట మండలాలు ఓ క్లస్టర్‌గా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా 111 రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులనుంచి సమగ్ర ఉద్యాన అభివృద్ధికి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. బోరుబావులు కలిగిన రైతులకు బిందుసేద్యం పద్ధతి అందుబాటులో తేవడం, ఎరువులను బిందుసేద్యం ద్వారా అందించే విధానంపై శిక్షణ ఇవ్వడం కార్యక్రమంలో ముఖ్యమైన అంశాలన్నారు. పంటకోత అనంతరం ఉత్పత్తుల నిల్వ, విలువ ఆధారిత ఉత్పత్తులతయారీపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కుప్పం మున్సిపల్ వార్డుల రిజర్వేషన్లు ఇలా

కుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 32 వార్డులకు సంబంధించి రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఖరారు చేశారు. ఈమేరకు చిత్తూరు జిల్లా గెజిట్‌ను విడుదల చేశారు. వార్డుల రిజర్వేషన్ల వివరాలిలా ఉన్నాయి. ఎస్టీ జనరల్ 1వవార్డు, ఎస్సీ మహిళలు 19,04, 11 వార్డులు, ఎస్సీ జనరల్ 10,03,28వార్డులు కేటాయించారు. అలాగే బిసి మహిళలకు 14,15,12,21, బిసి జనరల్‌కు 09,20,02,16,07 వార్డులు, మహిళలు జనరల్‌కు 17,23,31,32,24,29,22,18,30వార్డులు కేటాయించారు. అలాగే జనరల్ కేటగిరీలో 27,08,25,05,13,06,26వార్డులు ఉన్నాయి.

## పోలింగ్ బూత్ సెంటర్ గదులను పరి శీలించిన సీఐ

ఓబులవారిపల్లి, అక్టోబర్ 13 ప్రభాతవార్త



రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓబులవారిపల్లి మండలంలో మంగళవారం రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు. ఓబులవారిపల్లి తాసిల్దార్ సిద్దేశ్వర రావు అధ్యక్షతన పోలింగ్ బూత్ సెంటర్ గదులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పిటిసి, ఎంపీటీసీ ఇళ్లకు సంబంధించి ఎంపీడీవో కార్యాలయంలో బూతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని అలాగే. సర్పంచులు సంబంధించి ఓబులవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని గత ఎన్నికలలో కూడా ఇలాగే పోలింగ్ బూతులు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆ ప్రకారమే ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పోలింగ్ బూత్ కేంద్రాలను తలికి చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో. ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్ ఇన్చార్జి ఎంపీడీవో కృష్ణయ్య ఆర్ఐ మల్లికార్జున సెక్రటరీలు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓటు వేయండి

చిత్తూరురూరల్, అక్టోబరు 13 ప్రభాతవార్త:



చిత్తూరునగరంలో గతంలో ఎన్నడూ లేనంతగా జరుగుతున్న అభివృద్ధిని చూసి కూటమి ప్రభుత్వానికి ఓటు వేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. మంగళ వారం నగరంలోని పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి రూ. 2.67కోట్ల విలువైన అభివృద్ధి పనుల కు ప్రారంభోత్సవాలు చేసారు. ఉదయం తేనబండ పర్యటనలో భాగంగా తేనెబండ, శ్రీనివాసపురం, న్యూగంగాకాలనీ, గంగాకాలనీలో రూ. 67.50లక్షలతో వేసిన సిమెంటురోడ్డును ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు నగరంలో ఎన్నడూ లేనంతగా ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నగరంలోని ప్రధాన రహదారులన్నీ త్వరలోనే సరికొత్త రూపు సంతరించుకుంటాయని, వీధులు సిమెంట్‌రోడ్లుగా మారుతాయన్నారు. రూ. 404కోట్లతో వివిధ కార్యక్రమాల ద్వారా సిమెంట్‌రొడ్డు, కాలువలు, వీధిలైట్లు, ప్రధాన రహదారుల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. గడిచిన రెండేళ్లలో చిత్తూరు సమగ్ర అభివృద్ధికి చిత్తశుద్దితో కృషి చేశామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలకు చెందిన కార్పొరేటర్, మేయర్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలన్నారు. అలాగే సాయంత్రం పలు వార్డుల పరిధిలో సిమెంట్‌రోడ్లు, సిమెంట్ కాలువలకు ప్రారంభోత్సవాలు, మరికొన్ని అభివృద్ధి పనులకు భూమి పూజ చేసారు. కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, క్లస్టర్, డివిజన్, బూత్ ఇన్‌ఛార్జీలు, తెదేపా కమిటీల సభ్యులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పుల్లంపేటలో జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలు

**పుల్లంపేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త** మండల కేంద్రమైన పుల్లంపేటలోని ఎస్‌బివిడి సభా విద్యాసంస్థల క్రీడా మైదానంలో మంగళవారం 13వ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ పోటీలలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్ అరవ శ్రీధర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దాహోదు పడతాయని క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టాలని అన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాలనుంచి జూనియర్ సాఫ్ట్ బాల్ బాలుర. బాలికల జట్టు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, కేశినేని నారాయణ నాయుడు, కావేటి వెంకటసుబ్బయ్య యాదవ్, రామచంద్రారెడ్డి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నారాయణవనంలో వాహనం ద్వారా భగద్గీత ప్రచారంకు స్పందన

నారాయణవనం, అక్టోబర్ 13 ప్రభాతవార్త : దశర పండుగ సందర్భంగా త్రైత సిద్దాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం మంగళవారం నారాయణవనంలో నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంను త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి-ఇందూ జ్ఞాన వేదిక పొదలకూరు, కుప్పం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్దాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ఇంటింటి ప్రచార కార్యక్రమంను నిర్వహించారు. వారు మాట్లాడుతూ జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరమే భగవద్గీతలో ముఖ్యమైన జ్ఞానం అని తెలిపారు. దశ అంటే పది ర అంటే నశింపజేయడం అని అర్థం. ఐదు కర్మేంద్రియాలను, ఐదు జ్ఞానేంద్రియాలను యోగ మార్గంలో నశింపజేయడం అంటే మొత్తం 10 ఇంద్రియాలను జయించడమే దశరా పండుగ యొక్క అర్థ అన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం కమిటీ సభ్యులు పెంచలనరసయ్య, వెంకటేశ్వర్లు మధు, వెంకట లక్ష్మమ్మ, బిందు, గీత, హరిత, సుష్మచ కిరణ్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరులో డెంగ్యూ

– వైద్యశాఖ అప్రమత్తం

చిత్తూరుహెల్త్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:

జిల్లా కేంద్రం చిత్తూరులో డెంగ్యూ జ్వరం కేసు నమోదు కావడంతో వైద్యశాఖ అప్రమత్తం అయ్యింది. చిత్తూరు టి.చవటపల్లి అర్బన్ ప్రైమరీ సెంటర్ పరిధిలోని తిమ్మసముద్రం వార్డు సచివాలయం దుర్గమ్మ కాలనీలో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైంది. దుర్గమ్మ కాలనీకి చెందిన ఓ కుటుంబంలో జోగేంద్ర(6)కు డెంగ్యూ జ్వరం సోకడంతో స్థానిక వైద్యం సరిపోకపోవడంతో జోగేంద్ర తల్లిదండ్రులు చికిత్స కోసం అతనిని వేలూరు సిఎంసి ఆసుపత్రిలో చేర్చారు. గత రెండు రోజులుగా పరిస్థితి అదుపులో వుండటంతో గురువారం జోగేంద్ర ఆసుపత్రి నుండి డిశ్చార్చి కావచ్చునని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ క్రమంలో దుర్గమ్మ కాలనీ పరిధిలో డెంగ్యూ పాజిటివ్ నమోదు కావడంతో మలేరియా అధికారులు సత్వరం స్పందించి డెంద్యూ జ్వరం పరిసరాల్లో వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు. ఈ మేరకు జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో చవటపల్లి అర్బన్ పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ దర్శన్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, మేల్ హెల్త్ అసిస్టెంట్స్ గణేష్, సురేష్, సిఠ గోపి, హెల్త్ సెక్రటరీ హేమలతలు ఇంటింటికి వెళ్ళి దోమల లార్వా సర్వే నిర్వహించారు. డెంగ్యూ జ్వరం వ్యాప్తి చెందకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

## ఎన్ఆర్ పేట పోలింగ్ కేంద్రాలు తనిఖీ

చిత్తూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త:



డిఎస్పీ వెంకట నారాయణ పర్యవేక్షణలో చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో ఎస్ఐ వి.మణి కంఠేశ్వరరెడ్డి పోలింగ్ కేంద్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాల వద్ద వున్న మౌళిక సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, సమస్యాత్మక ప్రాంతాలు, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టేందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధింత సిబ్బందికి సూచించారు.

## జనరల్ మహిళకు జడ్పీ ఛైర్మన్ రిజర్వేషన్

చిత్తూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త:

చిత్తూరు జడ్పీ ఛైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ అయ్యింది. ఇది వరకు అమలు జరిగిన జడ్పీ ఛైర్మన్ పదవుల రిజర్వేషన్లను పరిశీలిస్తే ఈ సారి జడ్పీ ఛైర్మన్ సీటు ఎస్సీ మహిళకు రిజర్వ్ కావాల్సి వుంది. ప్రస్తుతం ముగిసిన జడ్పీ పాలకవర్గంలో జడ్పీ ఛైర్మన్ పదవి బిసీ జనరల్‌కు కేటాయించడంతో ఆ వర్గం నుండి వైకాపా జడ్పీ ఛైర్మన్‌గా గోవిందప్ప శ్రీనివాసులు ఐదేళ్ళ పాటు జడ్పీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. అంతకు ముందు జడ్పీ ఛైర్మన్ పదవి ఓసీ మహిళలకు కేటాయించడంతో జడ్పీ ఛైర్‌పర్సన్‌గా గీర్వాణీ చంద్రప్రకాష్‌లు ఐదేళ్ళ పాటు జడ్పీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సారి జడ్పీ ఛైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ కావాల్సి వుంది. అయితే రాష్ట్రంలో కొత్తగా జిల్లా పరిషత్‌లు ఏర్పాటు కావడంతో చిత్తూరు జడ్పీ ఛైర్మన్ రిజర్వేషన్ సైతం తారుమారైనట్లు కన్పిస్తుంది.

## ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం

గుడిపాల, అక్టోబర్ 13 ప్రభాతవార్త:

మండలలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 22, 28 తేదీల్లో చెన్నై శంకర నేత్రాలయ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో పాపసముద్రం పంచాయతీకి చెందిన కీర్తిశేషులు కన్నయ్యరెడ్డి, రేణుకదేవిల జ్ఞాపకార్థం ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ భానుమూర్తిరెడ్డి, చంద్రకాంత్‌లు తెలిపారు. కంటి శుక్లం వున్న వారికి ఉచితంగా ఈ నెల 26, 30వ తేదీల్లో ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. కంటి పొరతో బాధపడుతున్న వారు ఈ శిబిరంను ఉపయోగించుకుని లబ్ది పొందాలని, సమాచారం కోసం 99517 71127 నెంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

## గాయత్రి దేవిగా ముత్యాలమ్మ

బంగారుపాళ్యం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:

నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గాయత్రిదేవిగా ముత్యాలమ్మ మంగళవారం రాత్రి దర్శనమిచ్చారు. బంగారుపాళ్యం రాజా వీధిలో వెలసిన గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ముత్యాలమ్మకు అర్చకులు మురళీస్వామి, కార్తిక్ స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణలో అమ్మవారి ఉత్సవమూర్తిని గాయత్రిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా చంద్రశేఖర్, గీత, తన్వికసాయిలు వ్యవహరించారు. ఇందులో ఆలయ అభివృద్ధి ఛైర్మన్ ఎంబి కృష్ణమూర్తి, ఇతర కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## టపాకాయలు పేలుడుపై కేసు నమోదు

బంగారుపాళ్యం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:

మండలంలోని సంక్రాంతిపల్లి వద్ద సోమవారం రాత్రి టపాకాయల గోడౌన్ పేలుడు కేసులో బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన కోడి అమరావతి పేరిట టపాకాయల లైసెన్సు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ లైసెన్సు ద్వారా టపాకాయల విక్రయాలు గ్రామానికి దూరంగా చేపట్టాల్సి వుంది. అయితే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అమరావతి కుటుంబసభ్యులు భరత్ జాతీయ రహదారికి ప్రక్కనే తాత్కాలిక షెడ్డులో విక్రయాలు చేపట్టాడు. సోమవారం రాత్రి ఈ షెడ్డులో వెల్డింగ్ పనులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో భారీగా నష్టం వాటిల్లింది. ఈ మేరకు భరత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పూతలపట్టు, అక్టోబర్ 13, ప్రభాతవార్త

పూతలపట్టు మండలంలోని తలపలపల్లి సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రఫీ మృతి చెందాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన రఫీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల కథనం ప్రకారం.. పూతలపట్టులో బియ్యం గోడౌన్‌లో పని చేస్తున్న రఫీ పూతలపట్టు నుంచి పీలేరుకు వెళ్తుండగా తలపలపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆయన సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న పూతలపట్టు సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య సిబ్బందితో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనం వివరాలను సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు. ఈ ఘటన పూతలపట్టు విషాదం నెలకొంది. రహదారులపై వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

## వైకాపాలో ఛైర్మన్ అభ్యర్థిత్వంపై ఏడుమంది కన్ను

కుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఐదారుమంది నాయకులు ఆశలు పెంచుకుంటున్నారు. అయితే ఎవరు ఛైర్మన్ అభ్యర్థి అనేది మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్ నిర్ణయిస్తారని ఆ పార్టీవర్గాల ద్వారా తెలిసింది. వైకాపా తరపున ఛైర్మన్ అభ్యర్థిత్వం ఆశిస్తున్న వారిలో ప్రస్తుత మున్సిపల్ కౌన్సిలర్లు అయిన రాజ్‌కుమార్,విజయ్, నాగరాజుతో పాటు వైకాపా నేతలుమూర్తి, నళినికుమార్, భాగ్యరాజ్ పేరు వినబడుతోంది. అయితే తాజాగా గణేష్ పేరు సైతం తెరపై వచ్చినట్లు సమాచారం. వీరిలో ఎవరు ఛైర్మన్ అభ్యర్థి అనేది తేలాల్సి ఉంది. మున్సిపల్ ఛైర్మన్ సీటు ఎస్సీ జనరల్‌కు రిజర్వు అయిన నేపథ్యంలో వైకాపాకు ఛైర్మన్ అభ్యర్థి ఎవరనేది ముమ్ముందు తేలనుంది.

## లక్ష దీపోత్సవం కార్యక్రమంకు పటిష్ట ఏర్పాట్లు

– టిటిడి జెఇఓ డాక్టర్ శరత్ –20న కార్యక్రమం.. ఏర్పాట్ల పరిశీలన !!

కుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త



తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అధ్వర్యంలో ఈనెల 20న కుప్పంలో చేపట్టే లక్ష దీపోత్సవం కార్యక్రమంకు సంబంధిత అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం టిటిడి జెఇఒ డాక్టర్ శరత్, ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కుప్పం ఎపిస్పి హేమంత్, సిఎం పిఎ శ్రీకాంత్ తదితరులు లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహించే పాతపేట చెరువు కట్ట కింద ప్రాంతంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈసందర్భంగా జెఇఒ మాట్లాడుతూ ఈ కార్యక్రమంకు దాదాపు పదివేల మంది దాకా మహిళలు హాజరయ్యే అవకాశం ఉంటుందన్నారు. మహిళలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆధ్యాత్మికంగా జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి లక్ష దీపాలతో ఉత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. వాహనాల పార్కింగ్, భద్రత ఏర్పాట్లు, మహిళలు, భక్తులకు తాగునీటి వసతి తదితరాలు కల్పించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, టిటిడి అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## మురుగునీటి శుద్ధి కేంద్రానికి

కలెక్టర్, ఎమ్మెల్యే భూమిపూజ

పలమనేరు. అక్టోబర్ 13. ప్రభాత వార్త :

పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని బొమ్మిదొడ్డి వద్ద రూ.17 కోట్ల రూపాయలతో మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని. మహిళా పాలిటెక్నికల్ కళాశాల వద్ద మరో 17 కోట్ల రూపాయలతో నీటి శుద్ధి ప్లాంటుకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పలమనేరు మున్సిపాలిటీలో వివిధ మౌలిక సదుపాయాలకు గతంలో 8.5 కోట్లు విడుదల చేశామని మరో ఐదు కోట్లు అదనంగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా ఈ నిధులు అందజేస్తున్నామని తెలిపారు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి ఇందుకు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పలమనేరు మున్సిపాలిటీకి ప్రభుత్వం రూ. 116 కోట్లు విడుదల చేయగా ఇప్పటికే 25 కోట్లతో పనులు జరుగుతున్నాయని తెలిపారు అదనంగా మురికినీటి శుద్ధి కేంద్రంతోపాటు నీటిశుద్ధి ప్లాంటుకు నిధులు విడుదల కావడం సంతోషదాయకమన్నారు. తాను ఇప్పటివరకు పుంగనూరు ఎమ్మెల్యేగా మూడుసార్లు పలమనేరు ఎమ్మెల్యేగా నాలుగుసార్లు పోటీ చేశారని మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందినప్పుడు అప్పటి కలెక్టర్ నరసింహ రావు రికార్డ్ స్థాయిలో నిధులు విడుదల చేసి సహకరించాలని తెలిపారు ప్రస్తుతం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఇదే ఒరవడి కొనసాగిస్తూ నిధులు విడుదల చేస్తూ సహకరిస్తున్నారని కొనియాడారు. మురుగునీటి శుద్ధి కేంద్రం వల్ల వచ్చే నీటితో రైతులు పంటలకు నీ రు అందించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే మహిళా పాలిటెక్నికల్ కళాశాల వద్ద నీటి శుద్ధి ప్లాంట్‌తో పట్టణంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భవాని మునిసిపల్ కమిషనర్ లోకేష్ వర్మ పలువురు అధికారులు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## విజయం బిజినెస్ స్కూల్‌లో 137మంది విద్యార్థులకు ఉద్యోగాలు



చిత్తూరురూరల్, అక్టోబరు 13 ప్రభాతవార్త:

చిత్తూరు సుందరరాజపురంలోని విజయం బిజినెస్ స్కూల్ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో సత్తా చాటారు. అక్టోబరు 10న నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్ ఫలితాలను మంగళవారం విడుదల చేయగా మొత్తం 137మంది విద్యార్థులు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సైడర్ కంపెనీకి 130మంది, రిజల్ట్‌సీఎక్స్ సంస్థకు ఏడుగురు ఎంపికైనట్లు కళాశాల ప్రతినిధులు వెల్లడించారు. ఈ ఎంపిక ప్రక్రియను ఆయా సంస్థల హెచ్‌ఆర్‌లు వెంకటకృష్ణ, జైగణేష్ సమర్థవంతంగా నిర్వహించగా, విజయం బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్ డా.కె జయంత్, విజయం డిగ్రీ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారులు జగదీశ్వర్, శ్రీనివాస్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అలాగే విద్యార్థులు సాధించిన విజయంపై విజయం విద్యాసంస్థల చైర్మన్ డా.ఎం. తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టరు డా.శైలజమూర్తిలు హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## జాప్యం లేకుండా రెవెన్యూ సమస్యలు పరిష్కారం

– జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

చిత్తూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త:



రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ సేవలను వేగవం తంగా, పారదర్శకంగా అందించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశిం చారు. కలెక్టరేట్‌లోని జెసి ఛాం బర్ నుండి జెసి ఆదర్శ్ రాజేంద్రన్ మంగళవారం రెవెన్యూ సమస్యలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ భూముల సమగ్ర రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సర్వే వేగవంతంగా నిర్వహించడంతో పాటు భూమి సరిహద్దులు, హక్కులు, రికార్డుల వివరాలు కచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో భూ వివాదాలకు తావు లేకుండా రికార్డులను పక్కాగా రూపొందించాలన్నారు. నిర్ణీత లక్ష్యాలను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయడానికి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం త్వరితంగా పరిష్కరించాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో తప్పిదాలకు తావు లేకుండా పాత భూ రికార్డులను క్షేత్రస్థాయి వివరాలతో పోల్చి పరిశీలించాలన్నారు. రీ-సర్వే పనుల పురోగతిపై రోజువారీగా పర్యవేక్షణ చేపట్టి, వారం వారీగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే డిడి జయరాజ్, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డ్వాక్రా నిధుల అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి



పెద్దపంజాణి, అక్టోబర్ 13 ప్రభాతవార్త:

పెద్దపంజాణి: డ్వాక్రా మహిళా స్వయం సహాయక సంఘాల నిధుల నిర్వహణలో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంఘమిత్రపై చిత్తూరు జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సంబంధిత రికార్డులు, బ్యాంకు ఖాతాల వివరాలను అధికారులు పరిశీలించారు.మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం అందిస్తున్న నిధులను దుర్వినియోగం చేస్తే సహించేది లేదని శ్రీదేవి స్పష్టం చేశారు. అవకతవకలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, దుర్వినియోగమైన నిధులను రికవరీ చేస్తామని హెచ్చరించారు.డ్వాక్రా సంఘాల పొదుపు, రుణాల లావాదేవీల రికార్డులను పక్కాగా నిర్వహించాలని, సంఘమిత్రల పనితీరుపై సీసీలు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విచారణలో ఏపీఎం నీరజ, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరాజరాజేశ్వరి దేవిగా మరగదాంభిగా అమ్మవారు

కాణిపాకం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం మరగదాంభిగా అమ్మవారు శ్రీరాజ రాజేశ్వరి దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈమేరకు శ్రీమణికంఠేశ ్వరాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి దూపధీప నైవేద్యాలను సమ ర్పించారు. అలాగే అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిం చారు.ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి మొకు ్కలు తీర్చుకున్నారు. అలాగే సాయంత్రం ఆలయ మండపంలో మహిళలు పెద్దఎత్తున సామూహిక కుంకుమార్చన నిర్వహించి ఉచిత తీర్థ,ప్రసాదాలను అందజేశారు. తిరిగి రాత్రి అలంకరించి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు,సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్ బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవి, ఆలయ అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ అలంకారంలో అమ్మవారి దర్శనం

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండ్యాల విజయ్ కుమార్

రైల్వే కోడూరు అర్బన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలం స్థానిక పొట్టి శ్రీరాములు వీధిలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా మూడవ రోజు అమ్మవారు భక్తులకు అన్నపూర్ణ అలంకారంతో దర్శనమిస్తారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపించారు. అమ్మవారి దర్శనంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది అని రైల్వే కోడూరు నియోజకవర్గం లోని ప్రజలందరూ అమ్మవారిని ఎంతో భక్తిశ్రద్ధలతో దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండ్యాల విజయ్ కుమార్ తెలిపారు. అంతేకాకుండా ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, యువజన సంఘం సభ్యులు, మహిళా మండలి సభ్యులు ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందని మీడియా వారికి తెలిపారు.

## సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

**- అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు**



సూళ్లూరుపేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త : మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు దాని చుట్టు పక్కల ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విషయమై స్థానిక పోలీస్ యంత్రాంగానికి భద్రతాపరమైన పలు సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్ల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రలలో ప్రవేశ, వెలుపలకి వెళ్లే మార్గాలలో బందోబస్తు పటిష్టంగా ఉండాలని కోరారు. నామినేషన్ల కేంద్రాల వద్ద నిరంతర నిఘా ఉంచాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పకడ్బందీగా ప్రణాళిక బద్ధంగా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ సూచించారు. ఎన్నికల్లో అల్లర్లులకు పాల్పడిన, ప్రజలకు ఇబ్బందులు కలిగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎం మురళీకృష్ణ, ఎస్సై జి.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

**- మెట్టు గ్రామంలో పోలీసుల అవగాహన**



చిట్టమూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త: స్థానిక సంస్థలకు నజరానా మోగడంతో పోలీసులు సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేపథ్యంలో మంగళవారం నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామంగా గుర్తింపుపడ్డ మెట్టు గ్రామంలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి చెంచుబాబు, వాకాడు సిఐ హుస్సేన్ బాషా, స్థానిక ఎస్సై నాగరాజు తదితరులు గ్రామంలోని రాజకీయ పార్టీ నాయకులు, గ్రామస్తులతో ముఖాముఖి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఎస్‌డిపీఓ చెంచు బాబు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వ హణకు ప్రజల భాగస్వామ్యంతో పాటు రాజకీయ నాయకులు కూడా వ్యక్తిగత ద్వేషాలను పక్కనపెట్టి సజావుగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని సూచించారు. గ్రామ ప్రజల సైతం రాజకీయ నాయకుల చేతుల్లో కీలుబొమ్మలు కాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమకు నచ్చిన వారికి ఓటు వేసుకుని ఎలాంటి ఘర్షణలకు వివాదాలకు తావు లేకుండా సహకరించాలని అన్నారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమం పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని చట్టాలపై గౌరవం ఉంచి పోలీసులకు సహకారం అందించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మెట్టు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## శ్రీ పార్వతీ దేవికి.. శ్రీ రాజరాజేశ్వరి అలంకారం



సూళ్ళూరుపేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త: సూళ్ళూరుపేటలోని శ్రీనాగేశ్వర స్వామిదేవస్థానంలో నిర్వ హిస్తున్న శరన్నవ రాత్రుల్లో భాగంగా మంగళవారం శ్రీ పార్వతి దేవికిశ్రీ రాజరాజేశ్వరి అలంకారాన్ని చేసి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీ పార్వతి దేవి మూల విరాట్‌కు బంగారు చీరను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రత్యేక అలంకారానికి ఈశ్వర వాక సుందరరెడ్డి, ప్రభావతి దంపతులుగా ఉన్నారు. సాయంత్రం అమ్మని సన్నిధిలో కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. దేవస్థానం ఛైర్మన్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, అర్చకులు పేటేటి సునీల్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## శ్రీ చెంగాళమ్మకు మన్నారుపోలూరు గ్రామస్తుల సారె



సూళ్లూరుపేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త: శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారికి ఆనవాయితీగా వస్తున్న సారెల సమర్పణలో భాగంగా మంగళవారం మన్నారు పోలూరు గ్రామస్తులు, వట్రపాలెం వాసులు అమ్మణ్ణికి భక్తి పూర్వకంగా సారెను సమర్పించారు. మేళతాళాలతో అంగరంగ వైభవంగా మన్నారు పోలూరు గ్రామం నుండి ప్రదర్శనగా బయలుదేరి కాలినడకన శ్రీచెంగాళమ్మ దేవస్థానాన్ని చేరుకున్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి, అభివృద్ధి కమిటీ సభ్యులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి సారె తెచ్చిన వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ మర్యాదలతో సన్మానించారు.

## వెంకటగిరి మున్సిపల్ పీఠం కోసం లక్ష్మి సాయి పోటీ!





వెంకటగిరి, అక్టోబర్ 13 ప్రభాతవార్త: మున్సిపల్ పీఠం దక్కించుకునేందుకు ఎమ్మెల్యే కుమార్తె కురుగొండ్ల లక్ష్మీ సాయి ప్రియ పోటీలో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చిని అంశంగా మారింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష్మీ సాయి ప్రియ పార్టీ మొదట టికెట్టు ఖరారు చేసింది. మరలా సాయి ప్రియ తండ్రి కురుగొండ్ల రామకృష్ణకు ఇచ్చారు. ఎమ్మెల్యేగా రామకృష్ణ 2009, 2014, 2024 విజయం సాధించారు. అయితే మున్సిపల్ చైర్మన్ పదవిని జనరల్ మహిళకు కేటాయించారు. ఎమ్మెల్యే కుమార్తె లక్ష్మిసాయి ప్రియ పోటీ చేస్తుందని పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ వర్గాలు కూడా లక్ష్మీ సాయి ప్రియ పోటీలో ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, మాజీ గ్రంథాలయ చైర్మన్ దొంతు శారద టిడిపి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఆమె విజయం సాధించి చైర్పర్సన్ పదవిని దక్కించుకున్నారు. మరలా జనరల్ మహిళకు కేటాయించడంతో ఆమె పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. తెలుగుదేశం పార్టీ టికెట్ కోసం ఆమె ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పారిశ్రామికవేత్త గంగా ప్రసాద్‌ను కూడా టికెట్ కోసం కలిశారు. వెంకటగిరి ప్రాంతంలో సాలి కులస్తులు ఎక్కువగా ఉండడంతో దొంతు శారద గెలుపు నల్లేరి మీద నడకని అందరూ భావిస్తున్నారు. శారదకు 20 సంవత్సరాల రాజకీయ అనుభవం కూడా ఉంది. ఇంకా టిడిపి టికెట్ కోసం పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ధీటైన అభ్యర్థిని కోసం అన్వేషణ ప్రారంభించారు. మున్సిపాలిటీలో 36 వార్డులు ఉన్నాయి. హోరాహోరీగా మున్సిపల్ ఎన్నికలు జరుగునున్నాయి.

## శ్రీ కన్యకా పరమేశ్వరి దేవికి... శ్రీభువనేశ్వరి అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త: శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల భాగంగా అమ్మవారికి మంగళవారం శ్రీ భువనేశ్వరి అలంకారాన్ని చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమ నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## రుయా ఆసుపత్రి అత్యవసర విభాగ నూతన భవనానికి శంకుస్థాపన



తిరుపతి హెల్త్, అక్టోబర్ 13 ప్రభాతవార్త: తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జెఎంసి (జంగాల పల్లి మోహన్ చారి) కంపెనీ ట్రస్ట్ ద్వారా అత్యంత ఉదారంగా యాభై లక్షల రూపాయల వ్యయంతో శ్రీ వేంకటేశ్వర రామ్ నారాయణ్ రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతమున్న అత్యవసర విభాగానికి అదనంగా మరొక కొత్త అత్యవసర విభాగపు బ్లాక్ నిర్మాణానికి శాసనసభ్యులు తిరుపతి ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ తిరుపతి డా.ఎస్. వెంకటేశ్వర్ చొరవతో మరో నలభై తొమ్మిది లక్షల రూపాయలు కలెక్టర్ వారి నిధులను కలిపి మొత్తం తొంబై తొమ్మిది లక్షల రూపాయల ప్రాథమిక అంచనా వ్యయంతో నిర్మించడానికి మంగళవారం భూమి పూజ చేయడం జరిగినది. 1962వ సంవత్సరములో అప్పటి భారత ప్రభుత్వ కేంద్ర హోంశాఖ మంత్రివర్యులు శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి గారిచే ప్రారంభించబడిన రుయా ప్రభుత్వ ఆసుపత్రికి ప్రస్తుతం రోజూ రెండు వేలకు పైబడి పేషెంట్లు ఓ.పి. విభాగపు చికిత్సకు మరియు ఎల్లవేళలా పదహైదు వందల మంది ఆసుపత్రిలో అడ్మిషన్ లోనూ చికిత్స పొందుతుంటారు. దీనికి అదనముగా ప్రతి నిత్యం అత్యవసర విభాగంలో వైద్యం కోసం సరాసరి మూడు వందల మంది పేషెంట్లు రావడము జరుగుతూ ఉన్నది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న అత్యవసర విభాగము సరిపోవడం లేదు. సమస్య తీవ్రతను గుర్తించిన స్వయముగా డాక్టర్ అయిన కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ తిరుపతి డా.ఎస్.వెంకటేశ్వర్ రుయా అదనపు వైద్య విద్యా సంచాలకులు, సూపరింటెండెంట్ డా.బి.మనోహర్‌తో చర్చించి వెంటనే చొరవ తీసుకుని నూతన అత్యవసర విభాగపు బ్లాక్ నిర్మాణపు ఆవశ్యకతను గుర్తించి స్థానిక శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులుచే నిర్వహించబడుతున్న జెఎంసి కంపెనీ ట్రస్ట్ ద్వారా యాభై లక్షల రూపాయలను డొనేట్ చేయుటకు ఉదారంగా అంగీకరింపచేసి అదనంగా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ తిరుపతి డా.ఎస్.వెంకటేశ్వర్ చొరవతో మరో నలభై తొమ్మిది లక్షల రూపాయలు కలెక్టర్ వారి నిధులను కలిపి మొత్తం తొంబై తొమ్మిది లక్షల రూపాయల ప్రాథమిక అంచనా వ్యయంతో నిర్మించడానికి శ్రీకారం చుట్టారు. మరో పదహారు నెలల సమయములో పూర్తికానున్న ఈ అదనపు అత్యవసర నూతన బ్లాక్ అందుబాటులోకి వచ్చిన అనంతరం మరో యాభై మంది పేషెంట్లకి అధునాతన సౌకర్యవంతమైన అత్యవసర వైద్యాన్ని అందించగలమన్నారు. తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ తిరుపతి డా.ఎస్.వెంకటేశ్వర్ వారి యొక్క దాతృత్వాన్ని ఈ సందర్భముగా పలువురు స్థానిక ప్రజలు మరియు వైద్య సిబ్బంది కొనియాడారు. డా.బి.మనోహర్ ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియచేస్తూ, ఇదే కళాశాల/ఆసుపత్రిలో 1985వ సంవత్సరములో ఎం.బి.బి.యస్. వైద్య విద్యార్థిగా, ఈ రోజు అదనపు సంచాలకులుగా ఇలా ఒక కొత్త భవనంను విరాళం ద్వారా సాధించుకోవడం చాలా ముదావహంగా ఉందన్నారు. డా.జి.రవి ప్రభు, ప్రిన్సిపాల్, శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల వారు ఈ సందర్భంగా శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ తిరుపతి డా.ఎస్.వెంకటేశ్వర్ వారి స్ఫూర్తితో మరికొందరు దాతల భవిష్యత్తులో మరింత ఉదారంగా ఆసుపత్రి అభివృద్ధికి ముందుకు రాగలరని ఆశిస్తూ తెలియచేశారు. బి.జె.పి.నాయకులు, తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి ప్రసంగిస్తూ రుయా ఆసుపత్రి కోసం తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహకారంతో తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహ యాదవ్, బి.జె.పి. తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, తిరుపతి జనసేన అధ్యక్షులు రాజ రెడ్డి మాట్లాడుతూ రుయా ఆసుపత్రి అభివృద్ధికి, పేషెంట్ వైద్య సౌకర్యాలకు తమవంతు కృషి అందిస్తామని ఈ సందర్భముగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బి.లక్ష్మీపతి, కరణం సందీప్, ఖాజా మొహిరుద్దిన్, మునస్వామిలతో పాటు అధికారులు డా.బాల కృష్ణ నాయక్, జిల్లా ఆరోగ్యవైద్యాధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.పి.యం.యస్.ఐ.డి.సి. పి.లోకేశ్వర రెడ్డి, డి.ఇ. రమణమూర్తి, రుయా సి.యస్.ఆర్.యం.ఓ. డా.బి.సుబ్బలక్ష్మమ్మ, డి.సి.యస్.ఆర్.యం.ఓ డా.పి.శ్రీనివాస్, రుయా అసిస్టెంట్ డైరెక్టర్ యం.రమేష్, ఏ.ఆర్.యం.ఓలు డా.ఇ.ఆర్.హరికృష్ణ, డా.జి.యస్.గోపినాధన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.జి.శ్రావణ కుమార్, ఉమామహేశ్వర్, పి.ఆర్.ఓ. వీర కిరణ్ తదిదరులు పాల్గొన్నారు.

## ఆలయం నిర్మాణానికి విరాళం



వెంకటగిరి, అక్టోబర్ 13 ప్రభాతవార్త: వేలంపాలలోని మంద నాంచారమ్మ ఆలయం నిర్మాణానికి వెంకటగిరి రాజ వంశస్థులు, యువరాజు వి.సర్వజ్ఞ కుమార యాచేంద్ర లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. మంద నాంచారమ్మ ఆలయాన్ని మొదలియార్ కులస్తులు నిర్మిస్తున్నారు. మొదలియార్ కుల సంఘం నాయకులు సర్వజ్ఞానం కలవగా ఆయన విరాళం అందజేశారు. సర్వజ్ఞకు మొదలియార్ కుల సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దసరా మహోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతుండగా పట్టణమంతా సంబరంగా విద్యుత్ దీపాల కాంతితో ముస్తాబు చేసారు. కాగా ఆలయంలో అర్చకత్వం నిర్వహించే అర్చకులు తమ ఇళ్ళలో బొమ్మల కొలువును ఆకర్షణీయంగా తీర్చి దిద్దుతుతున్నారు. ఈ నేపధ్యంలో శ్రీరామనగర్ కాలనీలో నివాసముంటున్న సతీష్(లోకేష్), కమలహాసన్ గురుకుల్స్ ఇంట బొమ్మల కొలువు నయనానందకరంగా మారింది. సుమారు 500 బొమ్మలను ఏర్పాటు చేసారు. బొమ్మలను ఏర్పాటు చేయడం కూడా ఎంతో ఆకర్షణీయంగా మారింది. ప్రతి రోజూ సాయంత్రం బొమ్మల కొలువుకు చుట్టుపక్కల మహిళలను ఆహ్వానించి వారికి తీర్థ ప్రసాదాలతో పాటు వాయనాలను అందిస్తున్నారు. చక్కటి ప్రసాదాలతో పాటు వాయనాలతో మహిళా భక్తులు ఆకర్షితులౌతున్నారు. శ్రీరామనగర్‌లో అర్చకుల ఇంట ప్రతి రోజూ పూజలతో పాటు సహస్రనామార్చనలు నిర్వహిస్తున్నారు. దాంతో చుట్టుపక్కల ఆధ్యాత్మిక చింతన చోటు చేసుకుంటుంది.

### కుప్పంలో పరిశ్రమలు, పురపాలక...

## ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను పరిశీలించిన ఏపీపీసీబీ ఛైర్మన్




కుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య, బోర్డు సభ్యుడు నాగేశ్వరరాజుతో కలిసి మంగళవారం కుప్పం పట్టణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కుప్పం పారిశ్రామిక ప్రాంతం, కుప్పం పురపాలక పరిధిలో కాలుష్య నియంత్రణ చర్యల అమలు, పర్యావరణ నిర్వహణ విధానాలు, ఘన వ్యర్థాల నిర్వహణ కార్యకలాపాలను సమీక్షించారు. పర్యటనలో భాగంగా గౌరవ ఛైర్మన్ మెస్సర్స్ హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించి, అక్కడ అమలులో ఉన్న జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వ్యవస్థ, మురుగునీటి శుద్ధి, నీటి పునర్వినియోగ ఏర్పాట్లు, పర్యావరణ కాలుష్య నివారణకు పరిశ్రమ చేపట్టిన



చర్యలను పరిశీలించారు. కాలుష్య నియంత్రణ వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహించడం, వాటికి క్రమం తప్పకుండా నిర్వహణ చేపట్టడం, బోర్డు నిర్దేశించిన పర్యావరణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించడం అత్యంత ముఖ్యమని ఛైర్మన్ నొక్కి చెప్పారు. కుప్పం పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమలు చేపడుతున్న వాయు, జల కాలుష్య నియంత్రణ చర్యలు, పచ్చదనం అభివృద్ధి కార్యక్రమాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యకలాపాలను కూడా గౌరవ ఛైర్మన్ సమీక్షించారు. కాలుష్య నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని, పరిశ్రమల ప్రాంగణాల్లో పచ్చదనాన్ని పెంచాలని, పర్యావరణ పరిరక్షణతో పాటు పరిసర ప్రాంతాల ప్రజల సంక్షేమానికి దోహదపడే అర్థవంతమైన సామాజిక బాధ్యత కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. అనంతరం కుప్పం పురపాలక సంఘానికి చెందిన సమీకృత ఘన వ్యర్థాల శుద్ధి, ప్రాసెసింగ్ కేంద్రాన్ని గౌరవ ఛైర్మన్ సందర్శించారు. పురపాలక ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించడం, వేరు చేయడం, ప్రాసెసింగ్ చేయడం, సురక్షితంగా పారవేయడం వంటి అంశాలపై ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలను సమీక్షించారు. అలాగే, గతంలో పేరుకుపోయిన ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి, పర్యావరణానికి అనుకూలంగా పునరుద్ధరించేందుకు కుప్పం పురపాలక సంఘం చేపడుతున్న బయోమైనింగ్ కార్యకలాపాలను కూడా సమీక్షించారు. పేరుకుపోయిన వ్యర్థాలను క్రమబద్ధంగా ప్రాసెసింగ్ చేయడం, పునర్వినియోగానికి అనువైన పదార్థాలను తిరిగి పొందడం, మిగిలిన వ్యర్థాలను పర్యావరణానికి హాని కలగని విధంగా సురక్షితంగా పారవేయడం అవసరమని ఆయన స్పష్టం చేశారు. పరిశ్రమలు, పట్టణ స్థానిక సంస్థలు స్థిరమైన పర్యావరణ నిర్వహణ విధానాలను అవలంబించాలని, కాలుష్య నియంత్రణ సౌకర్యాలను సమర్థవంతంగా నిర్వహించాలని, వనరుల పునరుద్ధరణ మరియు పునర్వినియోగాన్ని ప్రోత్సహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా, కాలుష్యరహితంగా ఉంచాలని ఛైర్మన్ సూచించారు.

## వైభవంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి... నవరాత్రి బ్రహ్మోత్సవాలు!

**-ఉదయం చిన్నశేష వాహనంపై**

**-రాత్రి హంస వాహనంపై స్వామివారి దర్శనం**





తిరుపతి రూరల్, అక్టోబర్ 13 ప్రభాతవార్త: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా కొనసాగుతున్నాయి. గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణలతో తుమ్మలగుంట పురవీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం చిన్నశేష వాహనంపై, రాత్రి హంస వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వడంతో గ్రామంలో భక్తి పారవశ్యం నెలకొంది.

**చిన్నశేష వాహనంపై స్వామివారి వైభవోత్సవం:**

బ్రహ్మోత్సవాల రెండో రోజు మంగళవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారిని విశేషంగా అలంకరించి చిన్నశేష వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ గ్రామ పురవీధుల్లో వాహనసేవ నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా, గోవింద నామస్మరణతో వీధులన్నీ మారుమోగాయి. అడుగడుగునా భక్తులు స్వామివారికి హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ వాహనసేవలో పాల్గొన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్వయంగా వాహన బేరర్‌గా మారి కొంతదూరం స్వామివారి వాహనాన్ని మోస్తూ సేవలందించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు స్వామివారికి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.

**హంస వాహనంపై కనువిందు చేసిన స్వామివారు:**

రాత్రి హంస వాహనంపై స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీపాలం కరణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య సాగిన హంస వాహనసేవ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామివారి అలంకారాన్ని తిలకించేందుకు భక్తులు వీధుల వెంట వేచి ఉండి దర్శనం చేసుకున్నారు. వివిధ దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు పాల్గొని వాహనసేవకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులతో పాటు తుమ్మలగుంట గ్రామస్తులు, భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉదయం చిన్నశేష వాహనసేవ నుంచి రాత్రి హంస వాహనసేవ వరకు ఆలయ పరిసరాలు భక్తజనంతో కళకళలాడాయి. సంప్రదాయబద్ధమైన పూజలు, వాహనసేవలు, భక్తుల భాగస్వామ్యంతో తుమ్మలగుంటలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుతున్నాయి.

## బ్రహ్మోత్సవాల వేళ కనిపించని భక్తులు



తిరుమల, అక్టోబర్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: దసరా సెలవులు, పెరటాసి మాసం చివరివారం కావడంతో బాటు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతూన్నా తిరుమలలో భక్తుల రద్దీ పెద్దగా లేదు. భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టైమ్ స్లాట్ టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 8 గంటల సమయం పడుతోంది. గ్యాలరీలు కూడా భక్తులు లేక వెలవెలపోతున్నాయి.

## ఏడుకొండల్లో నవరాత్రి బ్రహ్మోత్సవ శోభ

**-ఆకట్టుకున్న కళాబృందాలు నృత్యాలు**

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:**





కలియుగవైకుంఠం ఏడుకొండల్లో మొదలైన నవరాత్రి బ్రహ్మోత్సవాలలో వేడుకగా సాంస్కృతిక శోభ ఆకట్టుకుంటోంది. ఈ ఉత్సవాల్లో తొమ్మిదిరోజులు జరిగే వివిధ రకాల వాహనసేవల్లో దేశం నలు మూలల నుండి వచ్చిన నైపుణ్యత వున్న కళాకారులు కళాప్రదర్శనలు అద్భుతంగా ప్రదర్శిస్తున్నారు. చిన్నశేష వాహనసేవలో వాహనం ముందు భక్తులను ఆకట్టుకునేలా ప్రదర్శనలిచ్చారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్యప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కళాకారులు పలు ప్రదర్శనలిచ్చారు. శ్రీవారి వాహనసేవలో భక్తి పరిమళాలు వెదజల్లుతూ తొమ్మిది రాష్ట్రాల నుండి 17 కళాబృందాలు 489 మంది కళాకారుల ప్రదర్శనలిచ్చారు. తప్పెటగుళ్ల నృత్యం, థింసా నృత్యం, కురత్తి నృత్యం, కర్ణాటక జానపద కళలు ప్రాంతీయ జానపద సంప్రదాయాలను ప్రదర్శించి భక్తులను అలరించారు. తమ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించడం ద్వారా భారతీయ సంస్కృతిలోని వైవిధ్యం, ఐక్యత, భక్తి సంప్రదాయాల గొప్పతనం ప్రతిబింబించాయి. స్వామివారి సేవలో కళలను ప్రదర్శించడం కళాకారులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించగా, భక్తులకు కనులవిందైన సాంస్కృతిక వేడుకగా నిలిచింది.

## అష్టభుజ దుర్గ అలంకరణలో శ్రీ కామాక్షిదేవి

**పుత్తూరురూరల్, అక్టోబరు 13 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీ కామాక్షి దేవిని అష్టభుజ దుర్గా అలంకరణలో సుందరంగా అలంకరించారు. ఉదయం ఆలయంలోని కామాక్షిదేవికి శ్రీ సదాశివేశ్వర స్వామికి అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పరివా రదేవతలు కూడా విశేష పూజలు, అలంకరణలు, అర్చనలు చేశారు. రాత్రి అమ్మవారిని అష్టభుజ దుర్గా అలంకరణలో అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఉభయ దాతలుగా పుత్తూరు ఎన్‌జీవోఎస్ కాలనీకి చెందిన బాతుల బుల్లిబాబు అండ్ బ్రదర్స్, గణేష్ టైలర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో మామిడాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి మంగళహారతులు ఇచ్చి పూజలు చేశారు.

## డిప్లొమా తర్వాత ఉద్యోగానికి క్యాంపస్ బాట !

### ష్నైడర్ ఎలక్ట్రిక్ నియామకాలు.. రూ.3.12 లక్షల ప్యాకేజీ

**తిరుపతి విద్య, అక్టోబర్ 13 ప్రభాతవార్త**




డిప్లొమా చదువు పూర్తిచేసిన విద్యార్థినులు ఉద్యోగాల కోసం బయట వెతకాల్సిన అవసరం లేకుం డా కళాశాలకే పరిశ్రమల నియామక ప్రక్రియ రావడం సాంకేతిక విద్యా ర్థులకు ఉపాధి అవకాశాలను చేరువ చేస్తోంది. ఇందులో భాగంగా తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నియామక ప్రక్రియ నిర్వహించింది. ఎంపిక ప్రక్రియలో అర్హత సాధించే అభ్యర్థులకు ఏడాదికి రూ.3,12,330 వేతన ప్యాకేజీని సంస్థ నిర్ణయించింది.రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రక్రియకు 2025, 2026 సంవత్సరాల్లో డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థినులకు అవకాశం కల్పించారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (డీఈఈఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (డీఈసీఈ) విభాగాలకు చెందిన అర్హులు పాల్గొనేందుకు అవకాశం పొందారు.సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థినులకు పరిశ్రమల్లో పనిచేసే అవకాశం లభించడం ద్వారా చదువుకు ఉపాధికి మధ్య అనుసంధానం ఏర్పడనుంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. పద్మావతమ్మ సమక్షంలో నియామక కార్యక్రమం జరిగింది. అయితే, ఈ ప్రక్రియలో ఎంతమంది పాల్గొన్నారు, ఎంతమంది తుది ఎంపికకు అర్హత సాధించారు అనే వివరాలు వెల్లడైతే విద్యార్థినులకు అందిన ఉద్యోగ అవకాశాలపై మరింత స్పష్టత లభించనుంది.

## ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

**పుత్తూరురూరల్, అక్టోబరు 13 ప్రభాతవార్త:**

పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోటూ విలేజ్ కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో జిల్లా కో-ఇన్‌చార్జి పునబాకు మునివేలు మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మందకృష్ణ మాదిగ సేవలను కొనియాడారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా పర్రి యుగంధర్‌తో పాటు పలువురు నాయకులను ఎన్నుకున్నారు.

## అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలనకు అవకాశం : ఎస్ఐ

**విజయపురం, అక్టోబరు 13 ప్రభాతవార్త:**

అగ్రి గోల్డ్ బాండ్ల పరిశీలనకు ప్రభుత్వం ఒక ప్రత్యేక అవకాశం కల్పించినట్లు విజయపురం ఎస్ఐ వెంకట సుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోఅగ్రిగోల్డ్ బాధితులు ఎవరైనా ఉంటే తమ బాండ్లను తీసుకుని చిత్తూరు ఓల్డ్ ఎస్పీ ఆఫీస్‌కు వెళ్లి తెలియపరచుకోవచ్చని ఆయన సూచించారు.

## అన్నపూర్ణ అలంకరణలో కట్టమిద గంగమ్మ

**చిన్నగొట్టిగల్లు, అక్టోబరు 13 ప్రభాతవార్త:**

శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా చిన్నగొట్టిగల్లులోని కట్టమిద గంగమ్మ అమ్మవారు అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ధర్మకర్త నాగరాజ తీర్థ ప్రసాదాలు పంపిణి చేశారు పూజారి సుగుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే

### తహశీల్దార్ మధుసూదన్ రావు



**రామచంద్రాపురం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:**

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపడుతున్నామని తహశీల్దార్ మధుసూదన్ రావు అన్నారు. మంగళవారం నెత్తకుప్పంలో నిర్వహిస్తున్న రీ సర్వేను ఆయన రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ అమృతతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వేలో తీసుకోవాల్సిన హద్దుల వివరాలు, సాంకేతిక నిపుణతను వివరించారు. రైతుల భూమికి సురక్షితమైన సరిహద్దులను నిర్మించడమే రీ సర్వే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ ప్రదీప్ నాయుడు, విఎస్‌లు అశోక్, వాణి, తదితరులు పాల్గొన్నారు.

## భవాని మాలను ధరించిన పవిత్రమ్మ



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 13 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు బియ్య పు మధుసూధనరెడ్డి తనయ పవిత్రారెడ్డి మంగళవారం దసరా సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కనకాచలం కొండపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పొంగళ్ళు పెట్టారు.ఈ సందర్భంగా ఆమె భవాని మాల ధరించి ఆకర్షించారు.శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో భవాని మాల ధరించే మహిళా,పురుష భక్తుల తాకిడి పెరిగింది. మాలధరించిన భక్తులు విజయవాడ అమ్మవారి దర్శనంతో దీక్ష విరమిస్తారు.కాగా ఆలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో వెలసిన అమ్మవారికి పూజలు,అభిషేకాలు జరిపారు కాగా కనకాచలంపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో హాజరయ్యే భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేసారు.కాగా శ్రీకాళహస్తి మండలం వవేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళీమాత ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పూజలకు ఆమెతో పాటు పగడాల రాజు, మున్నా రాయల్, బాలిరెడ్డి, మునిరత్నం లోకేస్,కార్తీక్,మహమ్మద్ సూర్య, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి సిఐగా టి.వి.సత్యనారాయణ

**చంద్రగిరి, అక్టోబర్ 13 ప్రభాతవార్త:**



చంద్రగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.వి.సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ సురేష్‌కుమార్ బదిలీ కావడంతో భాకరాపేట సిఐగా పనిచేస్తున్న ఆయనను చంద్రగిరి సిఐగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్ఐలు రవిప్రకాష్ రెడ్డి, అరుణాచలం, అరుణ, ఇతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి స్వాగతం పలికారు. ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డిఎస్పీ జగదీష్ నాయక్ పర్యవేక్షణలో ప్రజల రక్షణకు కృషి చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపధ్యంలో ఈ ప్రాంత భౌగోళిక స్థితిగతులపై అవగాహన చేసుకోవాల్సి వుందన్నారు. రాజకీయ నాయకులు, పార్టీలు, ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. గంజాయి వినియోగం, విక్రయం, కలిగివుండటం, పేకాట వంటి అసాంఘిక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించనని తేల్చిచెప్పారు.

## ఆంజనేయ స్వామికి అభిషేకాలు

**శ్రీకాళహస్తి,జూన్ 13 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలోని 16కాళ్ళ మండపంలో వెలసిన ఆంజనేయస్వామికి మంగళవారం సందర్భం గా ప్రత్యేకాభిషేకాలు అలంకారాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్ఎంకె శ్రీనివాసులు గురుకుల్ అభిషేకాలను నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించారు.అలాగే దిగువ సన్నిధివీధిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేకాభిషేకాలు అలంకారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు విశేషంగా తీర్థ ప్రసాదాలు అందించారు.ఆలయంలోని 16కాళ్ళ మండపంలో వెలసిన ఆంజనేయ స్వామిని నిత్యం భక్తులు దర్శించుకుంటున్నారు.వేదపండితుల వేదమంత్రోచ్ఛారణలో ఆలయ ఆవరణ దద్దరిల్లింది.అనంతరం స్వామి వారికి ప్రత్యేకాలంకరణ నిర్వహించారు. ధూప దీన నైవేద్యాలు,మహాహారతి అందించారు.ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఉమర్‌అక్మల్

**శ్రీకాళహస్తి అక్టోబర్ 13 ప్రభాతవార్త**

రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలలో ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన శ్రీకాళహస్తి ఎంజిఎం గ్రూప్ ఆఫ్ డైరక్టర్ గుడ్లూరు.ఐశ్వర్యలక్ష్మి అభినందించారు.ఈ సందర్భంగా ఐశ్వర్యలక్ష్మి మాట్లాడుతూ తమ విద్యసంస్థ చదువులతో పాటు క్రీడల్లో కూడా సమాన ప్రాధాన్యత ఇస్తుందని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు.అదేవిధంగా జాతీయ స్థాయి లో కూడా ఉమర్ అక్మల్ విజయం సాధించి కళాశాలకు రాష్ట్రానికి మంచి పేరుతీసుకురావాలని ఆమె ఆకాక్షించారు.అండర్ 19 విభాగంలో రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీలు ఈ నెల 23 జరగనున్నుయన్నారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రిన్సిపల్ విఎస్ రత్నం విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నూతన డిఎస్పీని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**శ్రీకాళహస్తి అక్టోబర్ 13 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నూతన డిఎస్పీగా బాద్యతలు చేపట్టిన డి.పావనిని ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శ్రీకాళహస్తీశ్వరాలయ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించారు.నియోజక వర్గంలో శాంతి భద్రతల పరిరక్షణకు అణగారిన వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని ఎమార్పీఎస్ నాయకులు ఆమెను కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువసేన అధ్యక్షులు మన్నేపల్లి ఈశ్వర్ మాదిగ,రూరల్ మండల అధ్యక్షులు యువరాజు మాదిగ,నాయకులు యాసారపు ప్రసాద్‌మాదిగ,గంగలపూడిరమేష్‌బాబు మాదిగ,బుడగుంట సంతోష్ మాదిగ,నల్లిపాకు మునేంద్ర మాదిగ,రావినూతల మదన్‌మాదిగ,నపిర్ల బాలరాజు మాదిగలు పాల్గొన్నారు.

## దసరా సెలవులో దొంగల పట్ల అప్రమత్తంగా ఉండండి..

**శ్రీకాళహస్తి అక్టోబర్ 13 ప్రభాతవార్త**



దసరా పండుగ సెలవుల నేపధ్యంలో ప్రజలు తమ ఇళ్ళ భద్రత విషయంలో అత్యంత అప్రవత్తంగా ఉండాలని శ్రీకాళహస్తి సబ్ డివిజన్ నూతన డిఎస్పీ పావని సూచించారు. పండుగ కోసం చాలా మంది తమ ఇళ్ళకు తాళాలు వేసి ఊళ్ళకు వెళుతున్న నేపథ్యంలో ఈ సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దసరా సెలవులో నేరగాళ్ళు రెచ్చిపోయే అవకాశం ఉందని ఖాళీగా ఉన్న ఇళ్ళ లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు.ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు,నగదు ఉంచకుండా బ్యాంకులాకర్లలో భద్రపరుచుకోవాని ఆమె సూచించారు.ఇంటి తాళం వేసే విషయాన్ని నమ్మకమైన ఇరుగుపొరుగువారికి విషయం తెలియజేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.సీసీ కెమెరాలు ఉంచుకుంటే మరీ మంచిదన్నారు.నూతనంగా బాద్యతలు చేపట్టిన డిఎస్పీ ప్రజల భద్రత పట్ల చూపిస్తున్న చొరవ అప్రమత్తత పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీకాళహస్తి మండలంలో 30 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు..

**శ్రీకాళహస్తి రూరల్ అక్టోబర్ 13 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి మండలానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 30 మంది బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేయనున్నారు. బొజ్జల బృందమ్మ చే ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం రూ. 19,42,504/ విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఎం. రంగయ్యకు అత్యధికంగా రూ. 2,43,746/, బి. మోహన్ కృష్ణకు రూ. 1,45,826/, మండెం చిన్న మునిరెడ్డికి రూ. 1,43,502/, ఈ. తరుణ్ కుమార్ కు రూ. 1,16,158/, ఎం. వెంకట సుబ్బారెడ్డికి రూ. 1,00,662/ చొప్పున మంజూరయ్యాయి. ఉరందూరు, మంగళగుంట, భీమవరం, ఎంపేడు, వేలంపాడు, ఏలంపల్లి, కొత్తూరు, గుంటక్రిందపల్లె, గొల్లపల్లి, గుండ్లపల్లి, చల్లపాలెం, అక్కుర్తి, సుబ్బానా యుడు కండ్రిగ, పాపనపల్లి, కె. వెంకటాపురం, ముచ్చివోలు, పెనుకులపాడు, పోలి, ఎండ్రపల్లి, కె.పి.చింతల తదితర గ్రామాలకు చెందిన బాధితులు ఈ సహాయం పొందనున్నారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అనారోగ్య బాధితులను ఆదుకోవడమే లక్ష్యంగా సీఎం ఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల టీడీపీ నాయ కులు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయాదవ్,మాజీ అధ్యక్షులు కామేష్‌యాదవ్,సుబ్రమణ్యం నాయు డు,మనోహర్,సుమతి కార్యకర్తలు,కూటమి కుటుంబ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# తిరుపతి డివిజన్

## పాకాల మండలంలో దొంగల బరితెగింపు

**పాకాల ప్రభాత వార్త అక్టోబరు 13.**



పాకాల మండలంలో వ్యవసాయ పొలాలే లక్ష్యంగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు తెగబడటం ఆందోళన కలిగిస్తోంది. సామిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని పూతల పట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై అనంతరాయల గుడి ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న ద్వారక పొలంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పొలంలోని స్టార్టర్‌తో పాటు బోరు మోటార్‌కు సంబంధించిన విద్యుత్ వైర్లను కత్తిరించి తీసుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. రాత్రి వేళ పొలంలో ఎవరూ లేని సమయాన్ని అదునుగా చేసుకున్న దుండగులు, బోరు మోటార్ వద్దకు చేరుకుని వైర్లను కత్తిరించుకుని వెళ్లినట్లు తెలుస్తోంది. రైతులకు సాగునీరు అందించే బోరు మోటార్లనే లక్ష్యంగా చేసుకుని ఇలాంటి చర్యలకు పాల్పడటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కష్టపడిపంటలుసాగుచేసుకునే రైతులకు ఇటువంటి ఘటనలు అదనపు ఆర్థిక భారాన్ని మిగులుస్తున్నాయి.

**పోలీసులు స్పందించి దుండగులను గుర్తించాలి!**

వ్యవసాయ పొలాల్లో భద్రత కొరవడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళ పొలాల వద్ద నిఘా పెంచి, చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రైతుల శ్రమను, ఆస్తులను లక్ష్యంగా చేసుకునే ఇటువంటి దుశ్చర్యలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట

**రొంపిచెర్ల , అక్టోబర్ 13 ప్రభాతవార్త :**

అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల స్వీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు అగ్రిగోల్డ్ బాధితుల నుంచి బాండ్లు స్వీకరించనున్నట్లు మంత్రుల బృందం (అగ్రిగోల్డ్ బాధితుల సహాయ నిధి) విడుదల చేసిన అధికారిక ప్రకటనలో పేర్కొంది. పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన బాధితులు చిత్తూరులోని సాయుధ దళం కార్యాలయం, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన స్వీకరణ కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాండ్లు స్వీకరిస్తారు.బాధితులు ఒరిజినల్ అగ్రిగోల్డ్ బాండ్, స్వీయ ధ్రువీకరణతో కూడిన కలర్ జిరాక్స్, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్, ఆధార్ లేదా ఓటరు గుర్తింపు కార్డు లేదా రేషన్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో తీసుకురావాలని అధికారులు తెలిపారు.నామినీలు తమ గుర్తింపు పత్రాలు, డిపాజిటర్ మరణించి ఉంటే మరణ ధ్రువీకరణ పత్రం, సంబంధిత కుటుంబ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ఈ ప్రక్రియను సీఐడీ పోలీసు అధికారులు పర్యవేక్షించనున్నారు. అర్హులైన బాధితులు, డిపాజిటర్లు, చట్టబద్ధ వారసులు అవసరమైన పత్రాలతో నిర్ణీత కేంద్రానికి హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రొంపిచెర్ల ఎస్ఐ మధుసుధన్ కోరారు.

## పీ-4 జాబితాను సిద్ధం చేయండి

**కేవీబీపురం, అక్టోబరు 13 ప్రభాతవార్త:**

సంఘమిత్రలు పీ-4 జాబితాను సిద్ధం చేయాలని ఏపీఎం ఇందిర సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## 108లో ప్రసవం...పండంటి ఆడబిడ్డ జననం

**కేవీబీపురం, అక్టోబరు 13 ప్రభాతవార్త:**

మండలంలోని పోలీనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన భారతి 108లోనే ప్రసవించింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. భారతి పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కోవనూరు రోడ్డు వద్ద ప్రసవించింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఈఎంటి సురేఖ, పైలెట్ నాగయ్య, వైద్యసేవలు అందించారు.

## ప్రసన్న వెంకటేశ్వరుని దర్శించిన మంత్రి



**వడమాలపేట, అక్టోబరు 13 ప్రభాతవార్త:**

అభయహస్తంతో అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామిని తమిళనాడు రాష్ట్ర మంత్రి మంగళవారం దర్శించుకున్నారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి సంపత్ అప్పలాయగుంటకు చేరుకోగా ఆలయ అధికారి వేణుగోపాల్ దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆలయ విశిష్టతను వివరించి మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## అన్నపూర్ణగా కామాక్షాంభిగా..పార్వతీగా అవనాక్షమ్మ అమ్మవారు



***నారాయణవనం, అక్టోబర్ 13 ప్రభాతవార్త :*** మండలంలోని అన్ని అమ్మవారి ఆలయాల్లో దేవి నవరాత్రి ఉత్సవాల్లో మూడవ రోజు మంగళ వారం అమ్మవార్లు వివిధ రకాల రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అరణ్యంకండ్రిగ పంచాయతీ పరిధి కైలాసనాథకోనలో వెలసిన కామాక్షాం భిగా అమ్మవారి దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఉదయం అన్నపూర్ణదేవి అలంకరణలో కామాక్షాంభిగా అమ్మవారు దర్శనమిచ్చారు. అంతకుముందు ఆలయాన్ని శుద్ధి చేసిన తర్వాత అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. అలాగే భక్తిశ్రద్ధలతో జలపాతంలో స్నానం చేశారు. సముదాయం వెలసిన టిటిడి ఆలయం అవనాక్షమ్మ అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమి చ్చారు. అలాగే నారాయణవనం ద్రౌపతీదేవి అమ్మవారు, నారాయణవనం క్రాస్‌లో వెలసిన అవనాక్షమ్మ ఆలయంలోను అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు వెంకట శివ ప్రసాద్, షరాబు భరత్ తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీ రైల్వే డివిజన్ సాధించే వరకు విశ్రమించను

**రేణిగుంట, అక్టోబర్ 13, ప్రభాతవార్త:**




బాలాజీ రైల్వే డివిజన్ సాధించే వరకు అవిశ్రాంతంగా పోరాటం కొనసాగిస్తానని బాలాజీ రైల్వే డివిజన్ సాధన ఉద్యమకారుడు కుప్పాల గిరిధర కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం రేణిగుంట బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంగణాల్లో ఆయన జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శాలువాలు కప్పి, పూల బొకేలు అందజేసి సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పెద్ద ఎత్తున అన్నసంతర్పణ నిర్వహించగా, గిరిధర కుమార్ స్వయంగా అందరికీ భోజనం వడ్డించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు కోసం తన పోరాటాన్ని కొనసాగిస్తానని తెలిపారు. బాలాజీ డివిజన్ ఏర్పాటుతో తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి తదితర ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. రైల్వే రంగం అభివృద్ధి చెందడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. తిరుపతి ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు ఆవశ్యకమని ఆయన స్పష్టం చేశారు.కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మురుగయ్య, బండి బాబు, నాగేంద్ర, కార్తీక్, నీలేష్, చరణ్, బాల, నవీన్, ఓబుల్ రెడ్డి, బాలకృష్ణ, రమేష్, కుమార్, శ్రీనివాసులు, రాజేష్, రమణ తదితరులు పాల్గొన్నారు




విజయవాడ నుండి చీఫ్ సెక్రటరీ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ లు స్థానిక ఎన్నికల నిర్వహణ అంశం పై నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, జేసి అర్.గోవిందరావు, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఎం. జయకృష్ణ, తదితరులు.

**ప్రభాతవార్త, తిరుపతి కలెక్టరేట్**

